



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

సోమవారం,
జనవరి 26, 2026

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-




2026కు గాను

## 131 మందికి పద్మ అవార్డులు

ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ

ధర్మేంద్ర, అచ్యుతానందన్‌లకు పద్మవిభూషణ్

మమ్ముట్టి, అల్కా యాగ్నిక్, విజయ్ అమృత్‌రాజ్‌కు పద్మభూషణ్

తెలుగు రాష్ట్రాలకు ఈసారి ప్రత్యేక గౌరవం

న్యూఢిల్లీ, జనవరి 26: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక పద్మ అవార్డులను ప్రకటించింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 131 మంది ప్రముఖులకు ఈ ఏడాది పద్మ పురస్కారాలు లభించాయి. ఇందులో 5 మందికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించారు. ఈసారి అవార్డు గ్రహీతల్లో 19 మంది మహిళలు ఉండగా, 16 మందికి మరణానంతరం పురస్కారాలు ప్రకటించారు. అలాగే విదేశీయులు, ఎన్నారై విభాగంలో ఆరుగురు ఎంపికయ్యారు. కళలు, సామాజిక సేవ,

(మిగతా 2వ పేజీలో)

## బీఆర్ఎస్‌లో అంతర్గత కుట్రలే సింగరేణి రగడకు కారణం

పార్టీ లోపలే ఉండి కేసీఆర్‌కు ద్రోహం చేసే ప్రయత్నం జరుగుతోందని కవిత ఆరోపణ

సింగరేణి టెండర్లపై విచారణ డిమాండ్ వెనుక పెద్దచేప ప్రయోజనాలు

గుంటనక్క మాటలను అనుసరించి కేటీఆర్ తప్పుదారి పట్టారని వ్యాఖ్య

దళిత నేతలను అవమానించేలా హరీశ్‌రావు వ్యాఖ్యలున్నాయని విమర్శ

ఏబీఎన్‌పై నిషేధం కాదు.. ప్రజలే బీఆర్ఎస్‌ను బ్యాన్ చేస్తారన్న కవిత



హైదరాబాద్, జనవరి 25 : బీఆర్ఎస్‌లోనే కొనసాగుతూ పార్టీ అధినేత కేసీఆర్‌కు ద్రోహం చేయాలనే కుట్ర జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. సింగరేణి టెండర్ల అంశాన్ని అడ్డం పెట్టుకుని గుంపు మేస్త్రికి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఓ నేత పార్టీకి లోపలే నష్టం చేస్తున్నారని విమర్శించారు. ఆ నేత మాటలను నమ్మి కేటీఆర్ కూడా గుడ్డిగా గుంతలో పడుతున్నారని అన్నారు. ఆదివారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి సింగరేణిలో జరిగిన అన్ని టెండర్లు, కాంట్రాక్టులపై విచారణ జరపాలని బీఆర్ఎస్ నేతలు ఎందుకు డిమాండ్ చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. 2014 నుంచి విచారణ చేయాలని అడగడం అంటే బీఆర్ఎస్ ప్రభుత్వంపైనే విచారణ కోరినట్లే కాదా? అని ప్రశ్నించారు. అయినా అదే డిమాండ్‌ను కేటీఆర్ కూడా చేయడం బాధాకరమన్నారు. సింగరేణిలో

(మిగతా 2వ పేజీలో)



## సింగరేణి స్కామ్‌లో సీఎం రేవంత్ సూత్రధారి: హరీశ్

సీఎం రేవంత్ సూత్రధారని, ఆయన బావమరిది లబ్ధిదారుడని ఆరోపణ

సైట్ విజిట్ సర్టిఫికెట్ టెండర్లను రద్దు చేసి, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్

## నాంపల్లి మృతుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా



నాంపల్లి అగ్నిప్రమాద మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా

ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం

షాపు యజమాని నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమిక నిర్ధారణ

బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్న మంత్రి పొంగులేటి




## రాజ్యాంగంపై బీజేపీ బుల్డోజర్

లౌకికత్వం, ప్రజాస్వామ్య విలువలను నికూల్చే ప్రయత్నమంటూ ఐద్వా విమర్శ

మహిళలకు అతిపెద్ద ముప్పు బీజేపీ ఆర్ఎస్ఎస్ నుంచేనని వ్యాఖ్య

గణతంత్ర దినోత్సవ సెల్యూట్ ప్రజల కోసం కాదన్న బృందాకారత్

మైక్రో ఫైనాన్స్ పేరుతో పేద మహిళలను అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపణ

హైదరాబాద్‌లో ఐద్వా జాతీయ మహాసభల సందర్భంగా భారీ ర్యాలీ



## శుభాంశు శుక్లాకు అశోక చక్ర




# 131 మందికి పద్మ అవార్డులు

ప్రజా వ్యవహారాలు, సైన్స్, వైద్యం, సాహిత్యం, క్రీడలు తదితర విభాగాల్లో విశేష సేవలందించిన వారికి కేంద్రం గౌరవం దక్కింది. దేశానికి అసాధారణ సేవలందించిన వారికి ఇచ్చే పద్మవిభూషణ్ పురస్కారం ఈసారి బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్రసింగ్ దేవల్ (మహారాష్ట్ర), కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్‌లకు మరణానంతరం ప్రకటించారు. వీరితో పాటు ప్రజా వ్యవహారాల విభాగంలో కె.టి.థామస్ (కేరళ), కళల విభాగంలో ఎన్.రాజమ్ (ఉత్తరప్రదేశ్), సాహిత్యంవిద్య విభాగంలో పి.నారాయణన్ (కేరళ) ఈ అత్యున్నత గౌరవానికి ఎంపికయ్యారు. విశిష్ట సేవలకు ఇచ్చే పద్మభూషణ్ పురస్కారాల జాబితాలో ప్రముఖ గాయని అల్కా యాగ్నిక్, మలయాళ సినీ నటుడు మమ్ముట్టి, మాజీ గవర్నర్ భగత్ సింగ్ కోష్యారీ, పారిశ్రామికవేత్త ఉదయ్ కోటక్, టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్, ప్రకటన రంగ ప్రముఖుడు పియూష్ పాండే వంటి వారు ఉన్నారు.

**తెలుగు రాష్ట్రాలకు పద్మ పంట**

ఈసారి పద్మ పురస్కారాల్లో తెలుగు రాష్ట్రాలకు విశేష గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి సీనియర్ నటుడు, మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్‌కు కళల విభాగంలో పద్మశ్రీ వరించింది. గద్దె బాబూ రాజేంద్ర ప్రసాద్ (కళలు), మరణానంతరం గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ (కళలు), వెంపటి కుటుంబ శాస్త్రి (సాహిత్యం) కూడా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డి (కళలు), వైద్య రంగంలో గూడూరు వెంకటరావు, పాల్కొండ విజయ్ ఆనంద్‌రెడ్డి పద్మశ్రీ అందుకోనున్నారు. సైన్స్ విభాగంలో చంద్రమౌళి గడ్డమణుగు, కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్, కుమారస్వామి తంగరాజ్, పశుసంవర్ధక రంగంలో రామారెడ్డి మామిడి (మరణానంతరం) తెలంగాణకు కీర్తి తెచ్చారు. యూజీసీ మాజీ చైర్మన్, నల్గొండ జిల్లాకు చెందిన మామిడాల జగదీశ్ కుమార్‌కు సాహిత్యంవిద్య విభాగంలో పద్మశ్రీ లభించింది. క్రీడారంగంలో టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ భుల్లర్, హాకీ క్రీడాకారిణి సవితా పునియా పద్మశ్రీతో సత్కరించబడ్డారు. సినీ రంగం నుంచి బెంగాలీ నటుడు ప్రోసెన్‌జిత్ ఛటర్జీ, మరణానంతరం నటుడు సతీష్ షా, అనిల్ కుమార్ రస్తోగి ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. పద్మ అవార్డుల ప్రదానోత్సవం మార్చి లేదా ఏప్రిల్‌లో రాష్ట్రపతి భవన్‌లో జరగనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు గ్రహీతలు పురస్కారాలు అందుకోనున్నారు.

# బీఆర్ఎస్‌లో అంతర్గత కుట్రలే సింగరేణి రగడకు కారణం

కాంగ్రెస్ వాటాలు తేలలేదని గుంటనక్క ఆరోపిస్తున్నారని, కానీ అసలు తన వాటాలే తేలకపోవడంతోనే అలా మాట్లాడుతున్నారని కవిత విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణిలో ఎక్సెస్‌కు టెండర్లు పోలేదని చెప్పడం అబద్ధమని, అప్పట్లో దాదాపు 25 టెండర్లు పూర్తయ్యాయని, వాటిలో కొన్ని 16 నుంచి 8 శాతం వరకు అధిక ధరలకు కేటాయించారని ఆరోపించారు. సృజన్‌రెడ్డికి బీఆర్ఎస్ పాలనలోనే సింగరేణి పరిధిలో రెండు కాంట్రాక్టులు ఇచ్చారని గుర్తు చేశారు. అప్పట్లో ఆయన సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది అన్న విషయం ఎందుకు గుర్తుకు రాలేదని నిలదీశారు. చిన్నచేపగా చూపిస్తూ పెద్ద సంస్థకు రూ.25 వేల కోట్ల కాంట్రాక్టులు కట్టబెట్టేందుకు గుంటనక్క ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలోనే సింగరేణిపై రూ.25 వేల కోట్ల అప్పు పెట్టారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అది రూ.50 వేల కోట్లకు చేరిందని చెప్పారు.

**దళితులను అవమానించే వ్యాఖ్యలు**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు లేఖ రాయనని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికే రాస్తానని హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు దళిత వర్గాలను అవమానించడమేనని కవిత ఆరోపించారు. కేంద్ర మంత్రికి లేఖ రాయగానే వెంటనే కమిటీ వేయడంలో కుట్ర దాగి ఉందని అన్నారు. ఏజీఎం స్థాయి అధికారితో కమిటీ వేస్తే ఎండీని ఎలా ప్రశ్నిస్తారని ప్రశ్నించారు. జాగృతి తరఫున భట్టి విక్రమార్కకు పలు ప్రతిపాదనలతో లేఖ రాస్తామని, నైనీ బ్లాక్‌ను పరిశీలించేందుకు ప్రత్యేక బృందం వెళ్లనుందని తెలిపారు.

**మీడియాపై ద్వంద్వ వైఖరి**

కేటీఆర్‌పై కథనాలు వచ్చినప్పుడు చానెల్‌లపై దాడులు జరిగాయని, అదే దళిత మహిళపై కథనాలు ప్రసారం అయితే జర్నలిస్టులకు మద్దతు ఇచ్చారని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్‌కు కేటీఆర్‌కు ఒక నీతి, మహిళలకు మరో నీతా? అని ప్రశ్నించారు. నిబంధనలు ఉల్లంఘించిన యూట్యూబ్ చానెల్‌లను గత ప్రభుత్వం అరెస్ట్ చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం శాటిలైట్ చానెల్‌లపై కూడా చర్యలు తీసుకుందని చెప్పారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానెల్‌పై బీఆర్ఎస్ నిషేధం విధించిందన్న ఆరోపణలపై స్పందిస్తూ.. ఆ చానెల్‌ను బ్యాన్ చేయడం కాదు కానీ, త్వరలోనే ప్రజలే బీఆర్ఎస్‌ను బ్యాన్ చేస్తారని కవిత వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ అంశం జోక్‌గా మారిందని, మునిసిపల్ ఎన్నికల కోసమే ప్రభుత్వం డ్రామా చేస్తోందని విమర్శించారు.

**కాంగ్రెస్‌లో చేరే ప్రశ్నే లేదు**

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతుందని, తెలంగాణలో గెలిచే పార్టీ జాగృతేనని కవిత అన్నారు. ఓడిపోయే పార్టీలోకి వెళ్లాల్సిన అవసరం తనకు లేదన్నారు. తాను కాంగ్రెస్‌లో చేరతానని అడిగితే వద్దని చెప్పానన్న టీపీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యలు హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. మహేశ్‌గౌడ్ జాగృతిలోకి వస్తే జాతీయ కన్వీనర్‌గా బాధ్యతలు ఇస్తామని ఆహ్వానించారు.

# రాజ్యాంగంపై బీజేపీ బుల్డోజర్

**లౌకికత్వం, ప్రజాస్వామ్య విలువలను కూల్చే ప్రయత్నమంటూ ఐద్వా విమర్శ**

**మహిళలకు అతిపెద్ద ముప్పు బీజేపీఆర్ఎస్ఎస్ నుంచేనని వ్యాఖ్య**

**గణతంత్ర దినోత్సవ సెల్యూట్ ప్రజల కోసం కాదన్న బృందాకారత్**

**మైక్రో ఫైనాన్స్ పేరుతో పేద మహిళలను అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపణ**

**హైదరాబాద్‌లో ఐద్వా జాతీయ మహాసభల సందర్భంగా భారీ ర్యాలీ**




హైదరాబాద్, జనవరి 26 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తూ లౌకికత్వం, ప్రజాస్వామ్యం, సమానత్వం వంటి మౌలిక విలువలపై బుల్డోజర్ నడుపుతోందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ ప్యాట్రన్ బృందాకారత్ తీవ్రంగా విమర్శించారు. దేశానికి అతిపెద్ద ప్రమాదం బీజేపీ, ఆర్ఎస్ఎసేనని ఆమె వ్యాఖ్యానించారు. నగరంలోని బస్‌భవన్ మైదానంలో ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో బృందాకారత్ మాట్లాడుతూ.. రాజ్యాంగం హామీ ఇచ్చిన లౌకికత, ప్రజాస్వామ్య విలువలను కేంద్ర ప్రభుత్వం వ్యవస్థాగతంగా ధ్వంసం చేస్తోందని అన్నారు. అధికార బలంతో ప్రజల హక్కులను తొక్కేస్తోందని విమర్శించారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఇండియా గేట్ వద్ద తీసుకునే సెల్యూట్ రాజ్యాంగం కోసం కాదని, ప్రజల కోసం కూడా కాదని ఆమె ఆరోపించారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్ఎస్ఎస్ ఆలోచనలకే ఆ సెల్యూట్ అంకితమవుతుందని ధ్వజమెత్తారు. మహిళల భద్రత, హక్కుల విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. దేశంలో మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ వాటన్నింటికన్నా ప్రమాదకరంగా రాజ్యాంగానికి ఏర్పడుతున్న ముప్పే అత్యంత ఆందోళన కలిగిస్తోందని బృందాకారత్ అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే మహిళా ఉద్యమాల ప్రధాన లక్ష్యమని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు ఐద్వా ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలనే ప్రయత్నాలు పేదల జీవనాధారాన్ని దెబ్బతీస్తాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**మహిళలను అప్పుల ఊబిలోకి నెట్టుతున్నారు**

ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే మాట్లాడుతూ.. దేశంలోని పేద మహిళలకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. పనిలేని పరిస్థితుల్లో కుటుంబాన్ని ఎలా పోషించాలన్న ప్రశ్నను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల డిపాజిట్లను మైక్రో ఫైనాన్స్ సంస్థలకు మళ్లించి, అవే సంస్థలు పేద మహిళలకు అధిక వడ్డీతో రుణాలు ఇస్తున్నాయని ఆరోపించారు. వడ్డీలు చెల్లించలేక అనేక మంది మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పీకే శ్రీమతి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల మహిళల అభివృద్ధి వెనక్కి వెళుతోందన్నారు. మహిళా అక్షరాస్యత గణనీయంగా పడిపోయిందని పేర్కొన్నారు. ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు సుభాషిణి మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో మహిళల జీవన స్థితిగతులు మరింత దిగజారుతున్నాయని విమర్శించారు. ఈ బహిరంగ సభలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి ప్రసంగించారు. బహిరంగ సభకు ముందు ఆర్టీసీ కళ్యాణ మండపంలో ఐద్వా 14వ జాతీయ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు రాజకీయ, సామాజిక అంశాలపై తీర్మానాలు చేశారు. జాతీయ మహాసభల ప్రారంభ కార్యక్రమాన్ని ప్రముఖ నటి, స్క్రీన్ రైటర్ రోహిణి మొల్లేటి ప్రారంభించగా, ప్రొఫెసర్ శాంతసిన్హా హాజరైన ప్రతినిధులకు స్వాగతం పలికారు. అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి చిక్కడపల్లి మీదుగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వరకు ఎర్రజెండాలతో మహిళలు భారీ ర్యాలీగా తరలివెళ్లారు.

# సింగరేణి ప్రైవేటీకరణకు తావులేదు

**సంస్థను రాజకీయాలకు అతీతంగా కాపాడుకోవాలని కిషన్‌రెడ్డి వ్యాఖ్య**

**విదేశీ బొగ్గు దిగుమతులు తగ్గించడమే కేంద్ర లక్ష్యమన్న మంత్రి**

**కార్మికులకు లాభాలు అందాలన్నదే మోదీ ఆలోచన అని స్పష్టం**

**లెఫ్ట్ పార్టీల విమర్శలు ఉనికి కోసమేనని ఆరోపణ**

**పీవీకే5 గనిలో కార్మికులతో ఆత్మీయ సమావేశం**



రుద్రంపూర్, జనవరి 26 : సింగరేణి కాలరీస్ సంస్థను ప్రైవేటుపరం చేసే ప్రసక్తే లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సంస్థ ప్రైవేటీకరణపై జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని ఆయన తేల్చిచెప్పారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రుద్రంపూర్‌లోని పీవీకే5 భూగర్భ గనిలో కార్మికులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇల్లెందు క్లబ్‌లో కార్మిక సంఘాలు, బీఎంఎస్ నాయకులు, సింగరేణి అధికారులు పాల్గొన్న సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సింగరేణి లాభాలు ముందుగా కార్మికులకు అందాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనా విధానమని చెప్పారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో సుమారు 74 శాతం సింగరేణి బొగ్గుపైనే ఆధారపడి ఉందని, అనేక పరిశ్రమలు కూడా ఈ సంస్థపై ఆధారపడి నడుస్తున్నాయని తెలిపారు. సింగరేణి సంస్థను రాజకీయాలకు అతీతంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కిషన్‌రెడ్డి సూచించారు. దేశానికి ప్రతి సంవత్సరం విదేశాల నుంచి సుమారు రూ.700 కోట్ల విలువైన బొగ్గు దిగుమతి అవుతోందని, దీన్ని తగ్గించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. బొగ్గు నాణ్యతను మెరుగుపరిస్తే దిగుమతులు తగ్గి, భవిష్యత్తులో ఎగుమతులకు కూడా అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు, హైపవర్ వేతనాలు అందేలా కృషి చేస్తానని కిషన్‌రెడ్డి తెలిపారు. సంస్థకు రావాల్సిన బకాయిల వసూలు, కొత్త గనుల ప్రారంభం, ఉపాధి అవకాశాల విస్తరణపై కేంద్రం దృష్టి సారిస్తుందని చెప్పారు. సింగరేణి అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను చేపడతామని హామీ ఇచ్చారు. తెలంగాణలో లెఫ్ట్ పార్టీలు తమ ఉనికిని చాటుకునేందుకే సింగరేణి అంశంపై విమర్శలు చేస్తున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఒకప్పుడు 50 సీట్ల వరకు గెలిచిన లెఫ్ట్ పార్టీలు నేడు ఇతర పార్టీలపై ఆధారపడి ఒకటి, రెండు సీట్లకే పరిమితమయ్యాయని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను రెండు తోడు దొంగలుగా ఆయన అభివర్ణించారు. సింగరేణి నిధులను దుర్వినియోగం చేస్తున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వంపై కూడా మంత్రి విమర్శలు గుప్పించారు. కార్మికుల సొమ్మును ఇతర కార్యక్రమాలకు ఖర్చు చేసే అధికారం ముఖ్యమంత్రికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాలే కేంద్ర ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సీఎండీ కృష్ణభాస్కర్, డైరెక్టర్ (పర్సనల్) గౌతం పోట్రు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారత ప్రజాస్వామ్య బలోపేతంలో

# యువత పాత్ర అత్యంత కీలకం!

**ఓటు వేయడం ఒక హక్కే కాదు.. అది గొప్ప బాధ్యత కూడా : స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య బలోపేతంలో యువత పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా భారత్ గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. 1951 లో మొదలైన తొలి సాధారణ ఎన్నికల నుంచి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంలో ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తు చేస్తూ. ఓటు వేయడం ఒక హక్కే కాదు అది గొప్ప బాధ్యత కూడా అని అన్నారు వేలికి పడే చెరగని సిరా ముద్ర ప్రజాస్వామ్యానికి గౌరవ సూచికగా నిలిచిందన్నారు

## నాంపల్లి అగ్నిప్రమాదం..

# మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

**నాంపల్లి అగ్నిప్రమాద మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా**

**ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం**

**షాపు యజమాని నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమిక నిర్ధారణ**

**బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్న మంత్రి పొంగులేటి**



హైదరాబాద్‌లోని నాంపల్లిలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని, ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. నిన్న నాంపల్లి స్టేషన్ రోడ్డులోని బచ్చా క్యాజిల్ ఫర్నిచర్ మాల్‌లో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ప్రకటించిన నష్టపరిహారాన్ని తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందనకు మంత్రి పొంగులేటి ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, అగ్నిమాపక భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో షాపు యజమాని నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తేలిందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని, ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# సింగరేణి స్కామ్‌లో సీఎం రేవంత్ సూత్రధారి: హరీశ్

**సీఎం రేవంత్ సూత్రధారని, ఆయన బావమరిది లబ్ధిదారుడని ఆరోపణ**

**సైట్ విజిట్ సర్టిఫికెట్ టెండర్లను రద్దు చేసి, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్**

**సింగరేణి లాభాలను దాచిపెట్టి కార్మికుల బోనస్ తగ్గించారని విమర్శ**

**అవినీతిపై కేంద్రం మౌనం వీడాలని, బీజేపీ-కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయని ఆరోపణ**

సింగరేణి కాలరీస్‌లో భారీ అవినీతి జరిగిందని, దీని వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధనతో జారీ చేసిన టెండర్లన్నింటినీ తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ కుంభకోణంపై జ్యుడీషియల్ లేదా సీబీఐ విచారణ జరపాలని కోరారు. ఈ కుంభకోణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సూత్రధారి అని, ఆయన బావమరిది సృజన్ రెడ్డి ప్రధాన లబ్ధిదారుడని హరీశ్ రావు ఆరోపించారు. నైనీ టెండర్‌ను రద్దు చేయడమే ఇందులో తీవ్ర అక్రమాలు జరిగాయనడానికి నిదర్శనమని అన్నారు. సీఎంకు సన్నిహితులైన కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేందుకే టెండర్ నిబంధనలను మార్చారని విమర్శించారు. జనవరి 2025లో ఎలాంటి సైట్ విజిట్ నిబంధన లేకుండా అంచనా వ్యయం కంటే 7 శాతం తక్కువకు ఖరారైన భూపాలపల్లి పనుల టెండర్లను, మూడు నెలల్లోనే మే 2025లో కొత్త నిబంధనలతో ఎందుకు జారీ చేశారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఈ మార్పుల వల్ల పోటీ తగ్గి, సీఎం బంధువుకు చెందిన కంపెనీకి అంచనా కంటే ఎక్కువ ధరకు పనులు అప్పగించారని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానంతో మొదటి లబ్ధి పొందింది సృజన్ రెడ్డికి చెందిన 'శోధా కన్‌స్ట్రక్షన్స్' అని ఆయన పేర్కొన్నారు. అవినీతిపై సూటిగా సమాధానం చెప్పకుండా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంబంధం లేని పత్రాలు చూపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. కుంభకోణానికి బాధ్యులెవరు, ఎంత నష్టం వాటిల్లింది, ఎవరు లబ్ధి పొందారనే మూడు ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. సింగరేణికి వచ్చిన సుమారు రూ. 6,900 కోట్ల లాభాలను కాంగ్రెస్ ప్రభుత్వం దాచిపెట్టి, కార్మికుల బోనస్‌ను తగ్గించిందని కూడా ఆయన ఆరోపించారు. సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఈ అవినీతిపై మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోందని, సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కాంగ్రెస్, బీజేపీలు కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు.

## నిద్రిస్తున్న హిందూ యువకుడి

# సజీవ దహనం.. బంగ్లాదేశ్ లో మరో ఘోరం

**మైనారిటీ హిందువులపై బంగ్లాదేశ్ లో ఆగని హింస**

**హిందూ యువకుడి షాపుకు నిప్పు పెట్టిన దుండగులు**

బంగ్లాదేశ్ లో మరో ఘోరం చోటుచేసుకుంది. ఓ హిందూ యువకుడిని దుండగులు సజీవ దహనం చేశారు. శుక్రవారం రాత్రి నార్సింగ్ది ప్రాంతంలోని ఓ షాపులో చంచల్ భౌమిక్ (23) అనే యువకుడు నిద్రిస్తుండగా దుండగులు దాడి చేశారు. షాపు షట్టర్ మూసేసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. మంటల వేడికి నిద్రలో నుంచి లేచిన చంచల్ బయటపడేందుకు విఫలయత్నం చేశాడు. చంచల్ మంటల్లో కాలి చనిపోయాడని నిర్ధారించుకున్నాకే దుండగులు అక్కడి నుంచి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

**కుటుంబానికి చంచలే ఆధారం..**

చంచల్ భౌమిక్ తండ్రి చాలాకాలం క్రితమే చనిపోయాడు. తల్లితో పాటు ఇద్దరు సోదరులను చంచల్ తన కష్టంతో పోషిస్తున్నాడు. ఇందుకోసం నార్సింగ్ది ప్రాంతంలోని గ్యారేజీలో చంచల్ ఆరేళ్లుగా పనిచేస్తున్నాడు. కాగా, చంచల్ ను దుండగులు పథకం ప్రకారమే చంపేశారని ఆయన కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమ కుటుంబానికి ఉన్న ఒక్క ఆధారం కూడా పోయిందని చంచల్ తల్లి కన్నీటి పర్యంతమయ్యారు.



## వంగ మధుసూదన్ రెడ్డి అకాల మరణం తీవ్ర దిగబ్రాంతి కి గురిచేసింది

## మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

చంపాపేట్ వార్త మిర్రర్ ప్రతినిధి

చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి నాకు చాలా ఆత్మీయ మిత్రుడని ఆయన అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు

## ఢిల్లీ 'భారత్ పర్వ్'లో తెలంగాణ జానపద నృత్యాల వైభవం

## - ప్రదర్శించనున్న తాడెం భరత్ కుమార్



కల్వకుర్తి, జనవరి 25 వార్త మిర్రర్ ప్రతినిధి:–

భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట వేదికగా జనవరి 26 నుంచి 31 వరకు నిర్వహించనున్న భారత్ పర్వ్––2026 లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన కళాకారుడు తాడెం భరత్ కుమార్ ఎంపికయ్యారు.నాగర్?కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలం, జిల్లెల్ల గ్రామానికి చెందిన భరత్ కుమార్ ఈ ప్రతిష్ఠాత్మక వేదిక పై తెలంగాణ జానపద నృత్యాలను ప్రదర్శించను న్నారు. దేశవ్యాప్తంగా ఉన్న విభిన్న సంస్కృతులు, కళలు, వారసత్వాన్ని ప్రతిబింబించే ఈ మహోత్సవంలో తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమని పలువురు పేర్కొంటున్నారు.



## చెన్నకేశవ స్వామి ఆశీర్వాదం ప్రజలు అందరి పై ఉండాలి

## - ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి జనవరి 25 వార్త మిర్రర్ ప్రతినిధి:– కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో నిర్వహించిన కళ్యాణం, రథసప్తమి మహోత్సవాలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం మాడ్గుల మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,స్వామివారి ఆశీస్సులు పొందారు.తదుపరి బావోజి తాండకు చెందిన కాంగ్రెస్ నాయకుడు హరిలాల్ కుమారుడు నేనావత్ శ్రీనాధ్ ఆకస్మికంగా మరణించగా, ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాల్లో మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకి ఎన్?ఎఫ్?డీపీ సర్టిఫికెట్ కీలకం

## - జిల్లా డైరెక్టర్ గొడుగు భానుచందర్



కల్వకుర్తి, జనవరి 25 వార్త మిర్రర్ ప్రతినిధి:– నాగర్?కర్నూల్ జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్?ఫారం (ఎన్?ఎఫ్?డీపీ) సర్టిఫికెట్ ప్రతి మత్స్యకారుడు తప్పనిసరిగా పొందాలని అధికారులు తెలిపారు.ఈ సమావేశంలో నాగర్?కర్నూల్ జిల్లా మత్స్యశాఖ అధికారి నరసింహారావు, జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు వాకిటి ఆంజనేయులు, డీఎఫ్?సీఎస్ జిల్లా డైరెక్టర్ గొడుగు భానుచందర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోని ప్రతి మత్స్యకారుడు ఈ ఎన్?ఎఫ్?డీపీ సర్టిఫికెట్ పొందాలని కేంద్ర మత్స్యశాఖ మంత్రి ఆదేశించినట్లు తెలిపారు.జిల్లాలోని మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు తమ సొసైటీల్లో ఉన్న 18 సంవత్సరాలు నిండిన ప్రతి సభ్యుడికి ఈ సర్టిఫికెట్ తీసిపించాల్సిన బాధ్యత పూర్తిగా అధ్యక్షులదేనని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందే లోన్లు, వివిధ సంక్షేమ పథకాలు, బీమా సౌకర్యాలు పొందాలంటే ఈ ఎన్?ఎఫ్?డీపీ సర్టిఫికెట్ తప్పనిసరి అని తెలిపారు.అందువల్ల జిల్లాలోని ప్రతి మత్స్యకారుడు తమకు సమీపంలోని సీఎస్?సీ సి.ఎస్.సి కేంద్రంలో ఈ సర్టిఫికెట్ పొందవచ్చని అధికారులు సూచించారు.



## ఘనంగా నిజ్రా జన్మదిన వేడుకలు

## పాల్గొన్న ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు కైసర్

సంస్థాన్ నారాయణపురం జనవరి 25( వార్త మిర్రర్) సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా నాయకులు మహ్మద్ ఖాలేక్ కుమార్తె నిజ్రా జన్మదిన వేడుకలు వారి నివాసంలో ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు సంస్థాన్ నారాయణపురం మండలం ప్రెస్ క్లబ్ మండల ఉపాధ్యక్షులు షేక్ కైసర్ హాజరై నిజ్రా కి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసి ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గడ్డం రవి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం యాదగిరి,ఎర్ర లక్ష్మయ్య,వార్డు సభ్యులు మంచాల ఏసు,మంచాల రవీందర్,మాజీ వార్డు సభ్యులు తండ యాదయ్య,నాయకులు మంచాల దశరథ,తండ నరసింహ,చుక్క పరశు రాం,మహ్మద్ ఉస్మాన్,మహ్మద్ జమీల్ పాషా,మునీర్,అహ్మద్,షరీఫ్,లతీఫ్,భువనగిరి ఫేరోజ్ భాయ్,ఆదిల్, అఫ్ఫాన్,ఉమర్,అమాన్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వేలు గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం



సంస్థాన్ నారాయణపూర్ జనవరి 25( వార్త మిర్రర్)యాదాద్రి భువనగిరి జిల్లా, నారాయణపురం మండలం, సర్వేలు గ్రామంలోని, తెలంగాణ గురుకుల పాఠశాల సర్వేలు పూర్వ విద్యార్థుల సౌజన్యముతో, సర్వేలు గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మరియు సిబ్బంది కి ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం రోజు ఏర్పాటు చేయడమైనది.ఈ కార్యక్రమములో డా. బి నరేందర్ రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు డా. ప్రసాద్, డా. విజయా రావు, పూర్వ విద్యార్థి డాక్టర్లు డా. యు.యాదగిరి, డా. జె. రాము మరియు కామినేని దంత వైద్య కళాశాల మొబైల్ వైద్య బృందం పాల్గొని ఉచిత వైద్య మరియు దంత సంబంధిత సేవలు అందజేశారు. పూర్వ విద్యార్థి వేణు కుమార్ ఉచిత మందులను అందచేశారు. ఈ కార్యక్రమంలో అల్యూమిని అధ్యక్షులు బి. నరేందర్ రెడ్డి, కోశాధికారి యన్. పురుషోత్తం రెడ్డి, అల్యూమని సలహాదారులు మల్లేశం మరియు యం.రాజశేఖర్ రెడ్డి, సీనియర్ సభ్యులు చెన్న రాజా, సతీష్, వేణుకుమార్ మరియు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. పదవ తరగతి విద్యార్థులకు కేరీయర్ గైడెన్స్ కార్యక్రమాన్ని కూడా చేపట్టారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 25 క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మాజీ సర్పంచ్ ఎద్దండి భూమరెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలో గత పది రోజులుగా జరుగుతున్న రాయికల్ లోకల్ టోర్నీ క్రికెట్ సీజన్ 5 ఫైనల్ మ్యాచ్ ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఫైనల్ లో వికే వారియర్స్, హై క్లిక్ జట్లు తలపడగా హోరా హోరిక జరిగిన క్రికెట్ మ్యాచ్ లో విజేతగా వికే వారియర్స్, రన్నర్ గా హై క్లిక్ ట్రోఫీలను కైవసం చేసుకున్నాయి. మొదటి బహుమతి స్పాన్సర్ విశ్వశాంతి హై స్కూల్ మచ్చ గంగాధర్, ద్వితీయ బహుమతి స్పాన్సర్ శ్వేత ట్రేడర్స్ కాటిపల్లి రామిరెడ్డి, జట్ల స్పాన్సర్లు మచ్చ శేఖర్,హరీష్, సుంకే వంశీ, సురేష్,రాబ్బాని, శ్రావణ్, రోహిత్, టోర్నమెంట్ ఆర్గనైజర్లు హరీష్,రాం కీ,కోల నరేష్,ఫైజల్ లు సహకరించారు.గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బత్తిని భూమయ్య, సితార రెస్టారెంట్ రాజేష్, కామెంట్టర్ కిరణ్, ఫసి , క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ ఉషా ఛాయ సమేత సూర్యనారాయణ స్వామి కళ్యాణం



వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి జనవరి 25

రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని జగిత్యాల పట్టణం లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో సూర్యనారాయణ స్వామికి విశేష అభిషేకం నిర్వహించడంతో పాటు, శ్రీ ఉషా ఛాయ సమేత సూర్యనారాయణ స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఫౌండర్ డాక్టర్ రాజన్న, అధ్యక్షులు రామలింగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, గట్టు రాజేందర్, గోపి, రాజసాగర్, వి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.

## యాదగిరిగుట్ట మండలం రాళ్ల జనగాం గ్రామంలో పులి సంచారం -- దూడ మృతి

### సంఘటన స్థలాన్ని పరిశీలించిన- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య






యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం రాళ్ల జనగాం గ్రామ పరిధిలోని వ్యవసాయ బావి వద్ద పులి సంచారం కలకలం రేపింది. ఈ ఘటనలో పులి దాడి చేసి ఓ దూడను చంపి రక్తం పీల్చివేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా బాధిత రైతును ఎమ్మెల్యే ఓదార్చి,ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. అటవీ శాఖ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ట్రాప్ కెమెరాల సహాయంతో,డ్రోన్ కెమెరాల సహాయంతో,ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి గుర్తించాలని తెలిపారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని,పశువులను రాత్రి వేళల్లో సురక్షితంగా ఉంచుకోవాలని సూచించారు. చీకటి పడే లోపు గ్రామంలోకి రైతులు చేరుకోవాలన్నారు.పులి సంచారం నేపథ్యంలో గ్రామంలో భయాందోళనలు నెలకొనగా, అటవీ శాఖ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు

# ఋషి బద్రావతి దేవి కళ్యాణోత్సవ కార్యక్రమం







వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 25

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో 40వ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రథసప్తమి పర్వదిన సందర్భంగా శ్రీ భావన ఋషి బద్రావతి దేవి కళ్యాణోత్సవ కార్యక్రమం వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణతో దేవస్థాన కమిటీ అధ్యక్షులు బడుగు జయప్రకాష్ ప్రధాన కార్యదర్శి గోశిక బాల నరసింహ కళ్యాణ కర్తలుగా వ్యవహరించగా దేవస్థానం కార్యవర్గము, దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో శాశ్వత సభ్యులు ఆర్థికంగా వస్తురూపేనా సహకరించిన దాతల సమక్షంలో కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్థికంగా వస్తురూపేన సహకరించిన దాతలకు, సౌజన్య మూర్తులకు స్వామివారి శేష వస్త్రాలతో అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యవర్గం దేవస్థాన ధర్మకర్తలు మరియు వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణ కార్యక్రమాన్ని కనులారా వీక్షించి స్వామి వారి ఆశీస్సులు పొందడం జరిగింది.ఈ కార్యక్రమంలో శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానం అధ్యక్షులు బడుగు జయప్రకాష్,ప్రధాన కార్యదర్శి గోశిక బాల నరసింహ,ఉపాధ్యక్షులు నోముల రఘునాథ్ గోశిక బాలాజీ,సహాయ కార్యదర్శి గోలి శ్రీనివాస్ శ్రీమతి గోశిక చంద్రకళ నరసింహ, కోశాధికారి బడుగు సుజాత నర్సింహ,సాంస్కృతిక కార్యదర్శి బడుగు క్రాంతి కుమార్, ప్రచార కార్యదర్శి కర్నాటి జనార్ధన్,సమన్వయ కార్యదర్శులు గుర్రం సంతోష్ కుమార్, బాల్యం అనిల్ కుమార్,ధర్మకర్తల మండలి సభ్యులు కందగట్ల బిక్షపతి, బడుగు లక్ష్మయ్య,చిక్క నరసింహ,గోశిక అంజయ్య, బడుగు శ్రీరాములు గోశిక విఠలేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



## టిఎన్జీవోస్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా క్రీడ పోటీలు

మిర్యాలగూడ జనవరి 25:-( వార్త మిర్రర్) గణతంత్ర దినోత్సవం సందర్భంగా క్లియో స్పోర్ట్స్ స్టేడియంలో ఆదివారం టిఎన్జీవోస్ ఆధ్వర్యంలో క్రికెట్ ఫైనల్ గేమ్ జరిగింది. క్రిడలకు ముఖ్యఅతిథిగా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ ఆడి క్రికెటర్లను ఉత్సాహ పరిచారు. మ్యాచ్లో రెవెన్యూ శాఖ జట్టు ప్రధమ స్థానంలో నిలిచారు. టిఎన్జీవోస్ మిర్యాలగూడ ద్వితీయ స్థానంలో నిలిచారు. రెవెన్యూ టీంలో అనిల్, టి.రామకృష్ణ, అఖిల్, సతీష్ లు, టిఎన్జీఓస్ రన్నర్సైదులు గంగపుత్ర,నారాయణస్వామిమధుసూదనాచారి, జానీ పాషా, ఆజిముద్దీన్, కృష్ణా, రాహుల్, రామకోటి, వేణు,రంజిత్, సంతోష్, నవీన్ లు పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా క్రికెట్ తోపాటు బాడ్మింటన్, క్యారమ్, చెస్ తదితర క్రీడలను నిర్వహించారు.



## కార్మికులందరూ సంక్షేమ బోర్డులో సభ్యత్వం కలిగి ఉండాలి

### బిల్డింగ్ పెయింటింగ్ కార్మికునికి ఆర్థిక సహాయం అందజేత

మిర్యాలగూడ, జనవరి 25:-( వార్త మిర్రర్)

కార్మికులందరూ సంక్షేమ బోర్డులో సభ్యత్వం కలిగి ఉండాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ కోరారు. ఆదివారం స్థానికస్థానిక బిల్డింగ్ పెయింటింగ్ అడ్డా వద్ద సుందర్ నగర్ కు చెందిన పెయింటర్ యాట కలమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయం బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరూ సిఐటియు సభ్యత్వం కలిగి ఉండాలన్నారు. ఆపద సమయంలో సంఘం ఆదుకుంటుందన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం బలమైన పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రాగిరెడ్డి మంగారెడ్డి, బిఎం.నాయుడు, యాదగిరి, మంద రాజు, యూనియన్ అధ్యక్షులు పాషా, గోవర్ధన్ రెడ్డి, ఎస్పీ నాయక్, బుచ్చిబాబు, కలమ్మ, వెంకటమ్మ, ఎల్లమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు.







## జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ ప్రతిజ్ఞ

మిర్యాలగూడ, జనవరి 25:-( వార్త మిర్రర్) జాతీయ ఓటర్ల దినోత్సవశీ పురస్కరించుకొని మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుండి పాఠశాల, కళాశాల విద్యార్థులతో సబ్ కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, విద్యార్థుల ర్యాలీని సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ కార్యాలయం వద్దకు చేరుకొని ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, రెవిన్యూ, విద్యా శాఖ, విద్యార్థులతో తహసీల్దార్ పి.శ్రీనివాస్ ఓటు వినియోగంపై చేసుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అమిత్ మాట్లాడుతూ ఏ ఎన్నిక జరిగిన ఓటు సద్వినియోగం చేసుకోవాలని, సుపరిపాలకులను ఎన్నుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల విద్యాధ్యాధికారి ఎం.ధర్మనాయక్, సీనియర్ అసిస్టెంట్ ఎండి.అబ్బాస్, జూనియర్ అసిస్టెంట్ ఎండి.జమాల్, హెచ్డబ్ల్యూఓ ఎండి.జానిమియా ఆర్ఐ రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు కృష్ణకాంత్ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.




## 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 25

ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వారి సూచనలకు అనుగుణంగా 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం 2026 లో భాగంగా ఓటర్ల ప్రతిజ్ఞను చౌటుప్పల్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో పాటు స్థానిక మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గురవారావు స్థానిక మండల నాయబ్ తహశీల్దార్ పి. సిద్ధార్థ కుమార్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కే.సుధాకర్ రావు , రెవెన్యూ స్టాఫ్ స్థానిక బూత్ లెవెల్ అధికారులు వలిగొండ రోడ్ వరకు ర్యాలీ లో పాల్గొని, విద్యార్థులతో పాటు ప్రతిజ్ఞ చేసి, కొత్తగా ఓటు హక్కు పొందిన ఓటర్లని మరియు 80 వయసు మీద ఉన్న ఓటరుకు చిరు సన్మానం చేసి ఓటు ప్రాధాన్యత గురించి వివరించడం జరిగింది.

# హెల్మెట్ ప్రాణ రక్షణ కవచంలా భావించాలి

### మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర రాజు

### ఘనంగా జనయేత్రి ఫౌండేషన్ పంచమ వార్షికోత్సవం




మిర్యాలగూడ , జనవరి 25:-( వార్త మిర్రర్)

ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్?ను, ఫోర్ వీలర్ నడిపే వారు సీట్ బెల్ట్?ను భారంలా కాకుండా, ప్రాణరక్షణ కవచంలా భావించాలని మిర్యాలగూడ డిఎస్పి కె.రాజశేఖర రాజు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు కాదు మంచి సంస్కారం ఇవ్వాలన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణం ఎస్వి గార్డెన్ లో నిర్వహించిన జనయేత్రి ఫౌండేషన్ పంచమ వార్షికోత్సవంలో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో సంభవిస్తున్న మరణాలలో అధిక శాతం తలకు తగిలిన తీవ్ర గాయాల వల్ల లేదా సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల వాహనం నుండి బయట పడటం జరుగుతున్నాయన్నారు. ఒక చిన్న నిర్లక్ష్యం కుటుంబం మొత్తాన్ని కోలుకోలేని దెబ్బ తీస్తుందన్నారు. ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలకు పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ప్రజలందరూ పోలీసు వారికి సహకరించి, ప్రయాణాల్లో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ప్రపంచ ప్రఖ్యాత బ్లడ్ డోనర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఫౌండేషన్ విద్యా వైద్యం మరింత సేవలు అందించాలన్నారు. యువత రక్త దానాలు చేసి ప్రాణదాతలు కావాలన్నారు. హాస్య నటులు సుమన్ శెట్టి మాట్లాడుతూ గతంలో డాక్టర్లే దేవుళ్ళుగా భావించేవారని, ప్రస్తుతం పేద ప్రజలకు ఫౌండేషన్ ద్వారా సేవలు అందిస్తున్న వారే నిజమైన దేవుండ్లన్నారు. జనయేత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సినీ ఇండస్ట్రీ తరపున సహకారం చేస్తామని, వ్యవస్థాపకులను ఆయన అభినందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ కుల, మతాలకాతీతంగా నిరుపేదలకు వివిధ రకాలుగా సేవలు చేస్తూ రక్త దాన శిబిరాలు, అత్యవసర పరిస్థితుల్లో రక్త దానం చేస్తూ చేపిస్తూ ప్రాణాపాయం నుండి కాపాడుతున్నామని పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరాలు, అన్నదానం, దుప్పట్ల పంపిణీ,మజ్జిగ పంపిణీ, చలి వేంద్రాల ఏర్పాటు, అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో, నిరాశ్రయులకు పండ్లు, భోజనం ఏర్పాట్లు, విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు పంపిణీ, ఆపదలో ఉన్నవారికి నిత్యావసర సరుకులు, నిస్సహాయులకు ఆర్థికంగా,హార్థికంగా సహాయ సహకారాలు, రక్త దానాలు, ఇంకా ఇలా ఎన్నో సేవలను అందించామన్నారు. అనంతరం తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో సామాజిక సేవలు అందించిన వారిని శాలువాలతో సన్మానించారు.సమావేశంలో తొలి మహిళా ఆడియో ఇంజనీర్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ సాజిదా ఖాన్, జనయే త్రి ఫౌండేషన్ అడ్మినిస్ట్రేషన్ లింగారెడ్డి, ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ అజ్మత్ ఖాన్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, పుడమి సాహితి వేదిక జాతీయ అధ్యక్షులు చిలుముల బాల్ రెడ్డి, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పోనుగోటి హనుమంతరావు, స్టీరింగ్ కమిటీ తెలంగాణ సభ్యులు జాజాల కృష్ణ, దయాకర్ రెడ్డి, సయ్యద్ అజ్మత్, గాదె నరసింహ, కోట సైదులు, ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు పల్లె కిషోర్ కుమార్, కార్యదర్శి తాజ్ బాబా, కార్యనిర్వాహక అధ్యక్షులు కోమరాజు యాదగిరి పాల్గొన్నారు.

# ముగిసిన అటవీ జంతు గణన

### సిబ్బందికి సలహాలు సూచనలు చేసిన డి ఎఫ్ ఓ రవి ప్రసాద్ ........



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 25

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ ఫారెస్ట్ పరిధిలో వన్యప్రాణులు శాఖాహార మాంసాహార జంతువుల యొక్క గణన జిల్లా అటవీశాఖ అధికారి రవి ప్రసాద్, రేంజ్ ఆఫీసర్ పద్మారావు ఆధ్వర్యంలో సిబ్బంది గణన చేశారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి రవి ప్రసాద్ సిబ్బందితో కలిసి స్వయంగా అడవిలోకి వెళ్లి ఒర్రెలు, వాగులు అడవిలో ఉన్న కుంటల వద్ద అటవీ ప్రాంతం ఉదయం సాయంత్రం తిరిగి జంతువుల యొక్క పాదముద్రలు వాటి మలవిసర్జన భూమిని తవ్విన గుర్తులు చెట్లకు గీరిన గుర్తులు ఆధారంగా చూసి గణన చేశారు అల్లీపూర్ సెక్షన్ పరిది లోని అల్లీపూర్ వెస్ట్, అల్లీపూర్ ఈస్ట్, నాగనూర్ బీట్లలో అటవి అధికారుల జంతు గణన బృందాలు ప్రతి రోజు మొదటి 3రోజులు జనవరి 20 నుండి 22వరకు శాఖహర జంతువుల గణన చేపట్టినారు తదుపరి 3రోజులు జనవరి 23నుండి 25వరకు మాంసాహార జంతు గణన చేపట్టారు. జిల్లా అటవీశాఖ అధికారి అడవిలో జంతు గణన చేస్తున్న సిబ్బందికి ప్రతి రోజు ఆన్లైన్ సమావేసాలు నిర్వయహించి తగు సలహాలు సూచనలు చేశారు మాంసాహార జంతు గణన నిర్వయాహించే టప్పుడు క్రూర జంతువుల బారి నుండి జాగ్రత్త వహించాలని తెలిపారు. జిల్లా రేంజ్ ఉన్నతాధికారుల సూచన మేరకు అటవీ జంతువులు లెక్కింపు నిర్వహించామని దుర్గం సాంబయ్య అటవీ సెక్షన్ అధికారి అల్లీపూర్ తెలిపారు. జంతు గణన నిర్వహించిన వారిలో పూర్ణిమ అటవీ సెక్షన్ అధికారి, రమాదేవి అటవీ బీట్ అధికారి అల్లీపూర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ఊరుమడ్ల పోశాలు, మందుల గంగరాజం, దండవేణి అంజయ్య, వాలంటీర్లు గా వ్యవహరించి అటవీ జంతు గణన బృందాలకు తోడ్పాటు అందించారు.

## శివ నామ స్మరణ ఓం నమః శివాయ తో మారు మ్రోగిన ... శివాలయం .....

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 25జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ఆల్లీపూర్ గ్రామములో గల స్థానిక రాజ రాజేశ్వర స్వామి దేవాలయంలో .... మహా శివరాత్రి సందర్భముగా శివదీక్ష మాల ధారణ కార్యక్రమము వేద పండితులు అంగడి భూమేశ్వర్ స్వామి అయ్యగారు ఆధ్వర్యంలో .... అర్చకులు గురులింగు మఠం విక్రమ్ సారద్యంలో మండలము .. అర్ధ మండలము శివదీక్ష స్వీకరణ గావించి 41 రోజులు కఠిన నియమాలతో ప్రతి రోజు శివుని మూడు పూటలు పూజిస్తూ ... మహా శివరాత్రి వరకు దీక్ష నియామలతో అభిషేక, అర్చన భజన కార్యక్రమము లో ఆలయం మారు మ్రోగితుంది అని శివదీక్ష స్వాముల కోరకై అన్నదాన వెల్ఫేర్ ట్రస్టు ఏర్పాటు చేయడం జరిగినది అని, ప్రతి రోజు స్వాములు అందరికి భిక్ష, అల్పభిక్ష ట్రస్టు ద్వారా ఏర్పాటు చేయడం జరిగినది అని శివదీక్ష సీనియర్ స్వామి చిట్యాల భూమయ్య ... నామని లక్ష్మీనర్సయ్య .... తెలిపినారు... ప్రతి సంవత్సరం శివదీక్ష స్వాములకై ప్రతి నిత్యం భిక్ష, అల్పారం ఏర్పాటు చేయడం జరుగుతుంది అని తెలిపారు.... ప్రతి సోమ, శని వారం భజన కార్యక్రముతో హనుమాన్ భజన మండలి వారి ఆధ్వర్యములో భజన కార్యక్రమము కొనసాగుతుంది తెలిపారు...





## ముగ్గురు చిన్నారులను బలితీసుకున్న సెల్ఫీ సరదా

### బామ్మను చూసేందుకు సిటీ నుంచి పల్లెకు వచ్చిన ముగ్గురు చిన్నారులు

నాగర్‌కర్నూల్ జిల్లా ముచ్చర్లపల్లిలో ఆదివారం జరిగిన విషాద ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు నీటి గుంతలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్‌లోని తుర్కయాంజల్‌లో నివసించే శ్రీకాంత్‌రెడ్డి తన తల్లి సరస్వతమ్మను చూసేందుకు భార్యాపిల్లలతో కలిసి శనివారం స్వగ్రామమైన ముచ్చర్లపల్లికి వచ్చారు. ఆదివారం సరదాగా గడిపేందుకు పిల్లలతో కలిసి పొలానికి వెళ్లారు. అక్కడ నీటి గుంత పక్కన ఫోటోలు దిగుతున్న సమయంలో, శ్రీమాన్య (12) ఒక్కసారిగా కాలుజారి నీటిలో పడిపోయాడు. తమ్ముడిని కాపాడే ప్రయత్నంలో అక్క శ్రీకృతి (14), మేనత్త కూతురు స్నేహ (17) కూడా నీటిలోకి దిగి మునిగిపోయారు. మరో బాలిక విద్యాధరణిని తండ్రి శ్రీకాంత్‌రెడ్డి సకాలంలో బయటకు లాగగలిగినా, మిగిలిన ముగ్గురిని కాపాడలేకపోయారు. తనకు ఈత రాకపోవడంతో, తన కళ్లముందే బిడ్డలు ప్రాణాలు విడుస్తున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఆయన ఉండిపోవడం అక్కడి వారిని కలిచివేసింది. శ్రీమాన్య 6వ తరగతి, శ్రీకృతి 8వ తరగతి చదువుతుండగా, స్నేహ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. చదువుల్లో ఎంతో చురుగ్గా ఉండే ఈ ముగ్గురు చిన్నారులు విగతజీవులుగా పడి ఉండటం చూసి గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కల్వకుర్తి ఆసుపత్రిలో పోస్టుమార్టం ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బాధితులను పరామర్శించి ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



## సముద్రంలో మునిగిన ఫెర్రీ.. 13 మంది జలసమాధి, వంద మందికి పైగా గల్లంతు

### ఫిలిప్పీన్స్‌లో 300 మందితో వెళ్తూ మునిగిన ఫెర్రీ

దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 300 మందికి పైగా ప్రయాణికులు, సిబ్బందితో వెళ్తున్న ఒక ఫెర్రీ (ప్యాసింజర్ పడవ) సోమవారం తెల్లవారుజామున సముద్రంలో మునిగిపోయింది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 13 మంది మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. మరోవైపు, సహాయక బృందాలు 244 మందిని సురక్షితంగా కాపాడగలిగాయి. జాంబోంగా నగరం నుంచి సులు ప్రావిన్స్‌లోని జోలో ద్వీపానికి ఈ ఫెర్రీ బయలుదేరింది. మార్గమధ్యలో బాసిలన్ ప్రావిన్స్‌లోని బలుక్‌బలుక్ ద్వీపం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే కోస్ట్ గార్డ్ యూనిట్లు, నౌకలు, సమీపంలోని మత్స్యకారులు సహాయక చర్యలు ప్రారంభించారు. ఇప్పటివరకు 13 మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన వారి సంఖ్య ఇంకా కచ్చితంగా తెలియరాలేదు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియలేదని, దీనిపై దర్యాప్తు జరుపుతామని అధికారులు తెలిపారు. జాంబోంగా పోర్టు నుంచి బయలుదేరే ముందు కోస్ట్ గార్డ్ అధికారులు ఫెర్రీని తనిఖీ చేశారని, అప్పుడు ఓవర్‌లోడింగ్ సంకేతాలు ఏవీ లేవని స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ గాలి, సముద్ర మార్గాల ద్వారా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఫిలిప్పీన్స్‌లో తరచూ తుఫానులు, పడవల నిర్వహణ లోపాలు, నిబంధనలను సరిగా అమలు చేయకపోవడం వంటి కారణాలతో సముద్ర ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి. 1987లో జరిగిన డోనా పాజ్ ఫెర్రీ ప్రమాదంలో 4,300 మందికి పైగా మరణించడం ప్రపంచంలోనే అతిపెద్ద సముద్ర ప్రమాదంగా నమోదైంది.